క్లుప్తంగా

22న శ్రీగిరిలో ఉగాది పంచాంగ శ్రవణం

ఒంగోలు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న సాయంత్రం 6.30 గంటలకు ప్రముఖ వేద పురోహితుడు మఠంపల్లి దక్షిణామూర్తిచే పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీగిరి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా స్వామివారికి సువర్ణ అష్టాదళ పద్మ పాదార్చన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



నూతనంగా ప్రతిష్టించిన సీతారామ, లక్ష్మణుల విగ్రహాలు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం సిండికేట్ వీవర్స్‌కాలనీలో సీతారాముల, లక్ష్మణ, ఆంజనేయ, వినాయకస్వామి వార్ల విగ్రహ ప్రతిష్టామహోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్టామహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యజ్ఞాల అనంతరం విగ్రహ ప్రతిష్టను అవ్వారి శివకళ్యాణ్‌శర్మ బృందం పండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా జరిపించారు. విఘ్నేశ్వర పూజ, వాయుప్రతిష్ట, తీర్థ స్వీకరణ, యజ్ఞసాయన, మహాభిషేకంతో నూతనంగా విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. అలానే అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను సీతారామాంజనేయ స్వామి మందిర భక్త బృందం కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట

బల్లికురవ: గ్రామస్తుల సమష్టి కృషితో మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో జీర్ణావస్థకు చేరిన పోలేరమ్మ ఆలయానికి రూ.50 లక్షలతో పునః నిర్మాణం చేపట్టారు. సోమవారం నుంచి ప్రతిష్టా మహోత్సవాలకు అంకురార్పణతో శుక్రవారం ఉదయం 9.54 గంటలకు పోలేరమ్మ, ముత్యాలమ్మ, గంగాలమ్మ, పోతురాజు విగ్రహాలకు ప్రతిష్టించనున్నట్లు కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శైవాగమన పండితులు గూడూరు మోహనశర్మచే సోమవారం యాగశాల ప్రవేశంతో గణపతి పూజ, పుణ్యాహవచన, పంచగవ్య ప్రాసన దీక్షా ధారణ, మంగళవారం నిత్య విధులు, మహన్యాసం హోమం, జలాధివాసం చేపట్టనున్నట్లు చెప్పారు. వేడుకల్లో గ్రామంతో పాటు పరిసరగ్రామాల్లోని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

గురుకులం పిలుస్తోంది..

- జ్యోతిరావ్ పూలే గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 260 సీట్లు



వేటపాలెం గురుకుల పాఠశాల

వేటపాలెం: ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలే మార్చేసింది. గత ప్రభుత్వాలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోక నిర్వీర్యం చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మాత్రం పేద, మధ్య తరగతి కుటుంబాలను పట్టించుకొని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకున్నాడు. అదే విధంగా అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్య తదితర విద్యా పథకాలు ప్రవేశపెట్టి అట్టడుగున్న ఉన్న పేద కుటుంబాల్లో వెలుగులు నింపాడు. అంతేకాదు అన్నీ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యానికి పెద్దపీట వేశాడు. ఈక్రమంలోనే గురుకులంలో ఉచిత విద్య అందించేదుకు దరఖాస్తులు కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మహాత్మ జ్యోతిరావ్ బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల పాఠశాల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. కార్పొరేట్ తరహాలో విద్యనందించే విద్యా సంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 4లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందితే వసతితో పాటు పదోతరగతి వరకూ ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తారు. విద్యార్థులు మేలో జరిగే కామన్ టాలెంట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు. బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం బాలురు గురుకుల పాఠశాలలో 80 సీట్లు, నక్షత్రనగర్ బాలిక గురుకుల పాఠశాలలో 40, వేటపాలెంలోని బాలుర గురుకులంలో 80 సీట్లు ఉన్నాయి. ప్రకాశం జిల్లాలో మార్కాపురం గురుకుల బాలిక పాఠశాలలో 80, టంగుటూరు బాలిక గురుకులంలో 20, యర్రగొండపాలెం గురుకులంలో బాలురు 40, కొండపి బాలురు గురుకులంలో 40, కనిగిరి బాలిక గురుకుల పాఠశాలలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

బాపట్ల జిల్లా	గురుకులం	సీట్లు
నిజాంపట్నం	బాలురు	80
నక్షత్ర నగర్	బాలికలు	40
వేటపాలెం	బాలురు	80
ప్రకాశం జిల్లా..		
టంగుటూరు	బాలికలు	20
కొండపి	బాలురు	40
మార్కాపురం	బాలికలు	80
కనిగిరి	బాలికలు	40

ఇవీ అర్హతలు..

కుటుంబ సంవత్సర ఆదాయం రూ.1 లక్షకు మించకూడదు. విద్యార్థి ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏదైన పాఠశాల్లో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతూ ఉండాలి. వయస్సు ఎస్సీ, ఎస్టీ 2010 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2014 ఆగస్టు వరకు ఓసీ, బీసీ, బీసీ–సీ విద్యార్థులకు 2012 సెప్టెంబర్ నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్యన జన్మించిన వారు మాత్రమే అర్హులు. విద్యార్థి ఆధార్ కార్డు, ఫొటో, ఫోన్ నంబర్‌తో మీ దగ్గరలోని మీ–సేవా కేంద్రంలో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

గురుకుల హాస్టల్‌లో మంచి పౌష్టికాహారం..

వారానికి రెండు సార్లు చికెన్, ఆరు సార్లు కోడి గుడ్లు, ప్రతి రోజు బూస్ట్ కలిపిన పాలు, రాగిజావ, చిక్కీలు, అరటి పండు, వారంలో రెండు సార్లు ఇడ్లీ, పూరీ, ఆలు బిర్యానీ, పులిహోరా, ఉప్మాలాంటి వంటి పౌష్టికాహారం అందిస్తారు. మోను ప్రకారం ప్రతిరోజూ భోజనం అందజేస్తారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని గమనించడానికి వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటారు. వివరాలకు 96188 80036, 80744 63282 సంప్రదించాల్సి ఉంటుంది.

గురుకులంలో అన్ని సౌకర్యాలు..



గురుకుల పాఠశాల్లో ఇంగ్లిషు మీడియంలో విద్యాబోధనలతో పాటు అన్ని సౌకర్యాలు ఉంటాయి. ప్రభుత్వం ప్రకటించిన మోనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తారు. విద్యతో పాటు వ్యాయామం, క్రీడల్లోనూ విద్యార్థులకు ప్రోత్సాహం ఉంటుంది. విద్యార్థులకు పూర్తి భద్రత కల్పిస్తారు.

– బీ రజినీకుమారి, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, వేటపాలెం

విద్యాశాఖ అధికారుల వైఖరిని వ్యతిరేకిస్తున్నాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఒంగోలు: ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తూ కించపరిచేలా మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారుల వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక వేమూరి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 48వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకాలు, జేవీకే కిట్లు, వర్క్‌పుస్తకాలు సకాలంలో ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోకుండా.. అవి సరిగాలేవనే పేరుతో ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బోధన సమయంలో యాప్‌ల పేరుతో ఒత్తిడి తేవడం తగదని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు మన ఉద్యమంలో భాగమని, గెలుపు ఓటములు మన ఉద్యమాన్ని ఎలాంటి ప్రభావితం చేయలేవని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేసేందుకు ఉపాధ్యాయులు సంసిద్ధులు కావాలన్నారు. ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను పరిరక్షించుకోవడం కోసం ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో కలిసి ఒక ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రవి పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది.

అలరించిన సినీ సంగీత విభావరి



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు: స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము కళావేదికపై ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. పద్మశ్రీ ఘంటసాల, మొవ్వ సీతారామయ్య, బసవమ్మ, సాంస్కృతిక సేవా సంస్థ ప్రారంభ కార్యక్రమంగా నిర్వహించగా, ముందుగా ఘంటసాల మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాపట్ల డీపీఆర్వో తన్నీరు మోహన్‌రాజు, గుంరెడ్డి బాలాజీ, పెద్దిశెట్టి సుబ్బారావు, వేణుమాస్టర్ తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఘంటసాల మాస్టారు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన పాటలను గాయనీ గాయకులు పురాణం సుబ్రహ్మణ్యం, పెండ్యాల సాయి మాస్టర్, నూది రమేష్, గుమ్మడి శ్రీను, కొండలు, ఆకుల శ్రీను, హరిబాబు, అన్నపూర్ణ, శైలజ పాడిన పాటలు అలరించాయి. సంస్థ అధ్యక్షుడు మొవ్వ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పొన్నూరి వెంకట శ్రీనివాసులు వ్యవహరించారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ వర్కర్లు

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో పని చేసే వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం తెల్లవారుజామున స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. వారికి సంఘీభావంగా నిలిచిన సీఐటీయూ నాయకుడు పూసపాటి వెంకట్రావు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, వారికి సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కర్ల సంఘ నాయకులు ఇట్టా నాగయ్య, పాలేటి ఏడుకొండలు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తిదాయకం.. పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ బులుసు అపర్ణ

ఒంగోలు: పురస్కారాలనేవి యువతకు స్ఫూర్తిదాయకమని డాక్టర్ బులుసు అపర్ణ అన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శోభకృత్ నామసంవత్సర ఉగాది పురస్కార కార్యక్రమం నిర్వహించారు. కుర్రా కోటి సూర్యమ్మ స్మారక సాహితీ పురస్కారాన్ని బులుసు అపర్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృమూర్తికి భోజనం పెట్టడమే ఘనమైన కార్యంగా నేడు భావిస్తున్న తరుణంలో దేవతామూర్తుల పేరు అజరామరంగా ఉండాలంటూ 20 సంవత్సరాలుగా తల్లి పేరు మీద కుర్రా ప్రసాద్ అవార్డు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందంటారు.. కానీ, స్త్రీ విజయం వెనుక ఒక కుటుంబమే ఉందని డాక్టర్ అపర్ణ నిరూపించారన్నారు. మహిళ పేరుమీద ఏర్పాటు చేసిన అవార్డును ఒక మహిళా సాహిత్యవేత్తకు అందజేయగలగడం, అందులో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సభాధ్యక్షుడు, కార్యక్రమ నిర్వాహకుడు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ తనను ఒడిలో ఉంచుకుని లాలించిన అమ్మ ప్రేమకు గుర్తుగా ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నానని అన్నారు.

ఆకట్టుకున్న కవితాగానం...

ముందుగా శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది కవితా మహోత్సవం నిర్వహించారు. మొత్తం 30 మంది కవులు, కవయిత్రులు పాల్గొని కవితాగానంతో భువన విజయ ప్రాంగణంలో ఓబుల్‌రెడ్డి మాస్టారి ఆధ్వర్యంలో సాహితీపరిమళాలను వెదజల్లారు. మరోవైపు శోభకృత్ నామ ఉగాది కవితా మహోత్సవంలో భాగంగా వేదపండితులు దేశభవిష్యత్తును, రాశిఫలాలను వివరిస్తూ పంచాంగ శ్రవణం చేశారు. ముందుగా చందూ డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారుల బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఉగాది పురస్కారాలలో భాగంగా అవధాన విద్యా సరస్వతి, శతావధాని డాక్టర్ బులుసు అపర్ణకు కుర్రా కోటి సూర్యమ్మ స్మారక సాహితీ పురస్కారం, వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన గాడేపల్లి దివాకర దత్తు, మాగులూరి నాగేశ్వరరావు, షేక్ మొహమ్మద్, మారేపల్లి సూర్యకుమారి, గొల్లపూడి శ్రీహరి, నూకతోటి శరత్‌కుమార్, పతకమూరి సాంబయ్య, కొమ్మాల యశ్వినిలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా కంది రవిశంకర్, ఈదుపల్లి గురునాథం, అయినాబత్తిన ఘనశ్యాం, రచయిత్రి టి.అరుణ, వీరవల్లి సుబ్బారావు, తోటపల్లి వెంకట రంగారావు, సంగా తిరుపతిరావు, మిడసల మల్లికార్జునరావు, డి.రజని కుమారి, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, ఆరిగ శ్రీనివాస్, జక్కా సాయి బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామిని దర్శించుకున్న బాలబ్రహ్మానంద సరస్వతి



ఆలయంలో పురాణ విజ్ఞానంపై ప్రవచిస్తున్న బాలబ్రహ్మానంద సరస్వతి

ఒంగోలు: స్థానిక కొండమీద వేంచేసియున్న శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామిని నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ధర్మకర్తల మండలి, అర్చకులు, దేవస్థాన అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయంలో శ్రీదేవతా తత్వం పురాణ విజ్ఞానం గురించి భక్తులకు ఆయన ఉపదేశించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథం, సభ్యులు పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, కుర్రా ప్రసాద్‌బాబు, మురళి, ఈవో డి.రజనీకుమారి, అర్చకస్వాములు రామాంజనేయ అవధాని, రామకృష్ణస్వామి, త్రినాథ చక్రవర్తి, నాగార్జునదేవ్, శ్రీధర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం ఫాల్గుణ మాసం శతభిష నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రాంగోపాల్‌వర్మపై కేసు నమోదు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నాయకులు

ఒంగోలు: రాంగోపాల్‌వర్మపై కేసు నమోదు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో రాంగోపాల్‌వర్మ ఫొటోను చెప్పుతో కొడుతూ ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను కించపరుస్తూ ఆర్‌జీవీ మాట్లాడిన తీరును నిరసిస్తున్నామన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో అకడమిక్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఆయన.. విద్యార్థులను తప్పుదోవ పట్టించే విధంగా, మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో కూడా ఇదే తరహాలో మాట్లాడారన్నారు. అత్యున్నతమైన విద్యా సంస్థలలో విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వాల్సినటువంటి మేధావులను, విద్యావేత్తలను ఆహ్వానించాల్సిందిపోయి ఉన్మాదులను, సమాజం పట్ల బాధ్యతలేని సంఘ విద్రోహశక్తులు వంటి వారిని ఆహ్వానించడం సిగ్గుచేటన్నారు. రాంగోపాల్ వర్మను తక్షణమే అరెస్టుచేసి, వీసీని సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు మాలతి, జిల్లా అధ్యక్షులు షమ్మీ, గంగవరపు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు భోజనాల పంపిణీ



భోజనాలు పంపిణీ చేస్తున్న కేశవ

కొత్తపట్నం: మండల పరిధిలోని వృద్ధులు, వికలాంగులు, అనాథలకు మదర్ థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భోజనాలు పంపిణీ చేశారు. కొత్తపట్నంలో రోడ్ల వెంట భిక్షాటన చేసే వృద్ధులు, వికలాంగులు, అనాథలకు బైక్ మీద తిరిగి భోజనాలు అందజేశారు. ఎస్‌కే మస్తాన్‌వలి మనుమరాలు రుహి జన్మదినం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మదర్ థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డి.కేశవ తెలిపారు.

చెస్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విజేతలతో పాఠశాల సిబ్బంది

మార్కాపురం: ఒంగోలులో ఈ నెల 18న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం శ్రీదేవి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డోలా శ్యామలదేవి ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో ఏపీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా మొదటి బహుమతిని నాగస్వాతి, 3వ బహుమతి యం. స్నేహశ్రీ, సాధించినట్లు తెలిపారు. అండర్– 13 విభాగంలో 3వ బహుమతి టీవీ చంద్రిక సాధించి సత్తా చాటారని తెలిపారు. విజేతలకు స్పోర్ట్స్ అధికారి రాజేశ్వరి బహుమతులు అందించారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన ఆదివారం సాయంత్రం ఇసుక దరిశి సమీపంలో జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఇసుక దరిశి ఫ్లై ఓవర్ దిగువ భాగంలో తీవ్రగాయాలతో పడి ఉన్న వ్యక్తిని గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న 108 సిబ్బంది అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాల పాలైన అతని పేరు లక్ష్మయ్య అని కర్నూలు అని మాత్రమే చెప్పాడన్నారు.

ఆంజనేయ స్వామి తిరునాళ్ల రేపు

పొదిలి రూరల్: మండలంలోని ఏలూరు మూసి బ్రిడ్జి వద్ద ఒంగోలు–కర్నూలు రహదారి వెంబడి కొలవైయున్న అభయాంజనేయ స్వామి, వరసిద్ధి వినాయక స్వామి వార్ల 13వ వార్షికోత్సవ తిరునాళ్ల మంగళవారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు గోము ఆకుపూజ కార్యక్రమంతో మొదలై భక్తులు పొంగళ్లు చేసి నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం ఉప్పలపాడు వాస్తవ్యులు ఉలవా గోపి అధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుంది. రాత్రికి ఏలూరు గ్రామస్తుల విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ప్రభలపై పాటకచేరీ, కోలాటం, బ్రహ్మంగారి నాటకం ఉంటుందని కార్యనిర్వాహకుడు ధర్మవరపు ప్రసాద్ రెడ్డి తెలియజేశారు.



మూసీవద్ద కొలువైయున్న ఆంజనేయస్వామి

రిటైర్డ్ వీఆర్వో మృతి

చీమకుర్తి: రిటైర్డ్ వీఆర్వో సీహెచ్ సీతారామయ్య (64) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామానికి చెందిన సీతారామయ్య.. చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని పలు గ్రామాలకు వీఆర్వోగా పనిచేశారు. ఆయన మృతదేహానికి కుటుంబ సభ్యులతో పాటు పలువురు స్థానిక నాయకులు నివాళులర్పించారు.